## క్లుప్తంగా

### చురుగ్గా వ్యవసాయ పనులు



కోటవురట్లలో వరి చేనుకు ఎరువు వేస్తున్న రైతు

**కోటవురట్ల:** అల్పపీడన ప్రభావంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో వరి చేలకు ఎరువులు వేస్తున్నారు. తెగుళ్ల సోకకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పలు ప్రాంతాలలో వరి చేలు దుబ్బు కట్టి పచ్చగా కళకళలాడుతున్నాయి. మండలంలో ఈ ఏడాది 1,700 హెక్టార్లలో వరి సాగు జరిగింది. మంచి దిగుబడి రావాలనే తపనతో రైతులు వరిలో కలుపుతీత, ఎరువులు వేయడం వంటి పనులు జోరుగా నిర్వహిస్తున్నారు.

### అగ్నిప్రమాద బాధితులను ఆదుకున్న వెంకునాయుడు

**అచ్యుతాపురం(అనకాపల్లి):** మండలంలో కోనేంపాలెం వద్ద నాలుగు పూరిళ్లు ఆదివారం తెల్లవారుజామున దగ్ధమయ్యాయి. నిరాశ్రయులైన వారికి అచ్యుతాపురానికి చెందిన కూండ్రపు వెంకునాయుడు నాలుగు రోజులపాటు భోజనాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా వంటపాత్రలు, దుప్పట్లు అందజేశారు.

### త్వరలోనే మరింత యూరియా

**రాంబిల్లి:** మరో రెండు, మూడు రోజుల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని ఏవో సి.సుమంత ఆదివారం మీడియాకు తెలిపారు. ఇప్పటికే 100 టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామన్నారు. మరో 80 టన్నుల యూరియా కోసం ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతుల అవసరం మేరకు సత్వరమే రప్పించి, పంపిణీ చేస్తామని వెల్లడించారు.

### ఘనంగా పసల మారమ్మ పండగ



పసల మారమ్మ ఊరేగింపులో భక్తులు

**మునగపాక:** మండల కేంద్రమైన మునగపాకలో ఆదివారం పసల మారమ్మ పండగ ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాల నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ఘటాలు పట్టుకుని అమ్మవారి ఆలయం వద్దకు చేరి, పూజలు నిర్వహించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ టెక్కలి కొండలరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు.

### బ్రాండిక్స్‌లో నేత్ర వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**అచ్యుతాపురం(అనకాపల్లి):** బ్రాండిక్స్ అపెరల్ పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 270 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 157 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించారు. 60 మందికి మందులు పంపిణీ చేశారు. 20 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. బ్రాండిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 114వ వైద్య శిబిరమని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు. కంటి వైద్య శిబిరానికి హాజరైన వారందరికీ మజ్జిగ, అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు.

### పెన్షన్‌పై ఎంపీకి పీఆర్టీయూ వినతి

**అనకాపల్లిటౌన్:** జీపీఎస్ ప్రతిపాదనలను వెనక్కి తీసుకుని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలంటూ ఎంపీ బీవీ సత్యవతిని ఆమె కార్యాలయంలో పీఆర్టీయూ నేతలు ఆదివారం కలిసి కోరారు. ఈ మేరకు వారు ఎంపీకి వినతిపత్రం అందించారు. జీపీఎస్ అమలును వెనక్కి తీసుకుంటూ, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేసేలా సహాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, కార్యదర్శి పెద్దినాయుడు పాల్గొన్నారు.



# గ్రామాలు.. అభివృద్ధి సోపానాలు

గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు.. అని బలంగా నమ్మే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ చిన్న అవసరమొచ్చినా పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్యం, రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, వివిధ సంక్షేమ పథకాలకు కావాల్సిన ధ్రువపత్రాలు.. ఒకటేమిటి.. ప్రతీ అవసరం ప్రజల ముంగిటే. మునగపాకలో రోడ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణం పూర్తవడంతో సేవలు మరింత చేరువయ్యాయి.



మునగపాకలో రూ.48 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం



నూతనంగా నిర్మించిన మునగపాక బైపాస్ రోడ్డు

- మునగపాకలో రూ.కోట్ల నిధులతో అభివృద్ధి
- సత్వర సేవలే లక్ష్యంగా ప్రాధాన్యతా భవనాలు

**మునగపాక:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయడంతోపాటు, గ్రామాలు అభివృద్ధి చిరునామాగా మారుతున్నాయి. మునగపాక మండలంలో ఒక వైపు సంక్షేమం మరో వైపు గ్రామాలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పన పూర్తి స్థాయిలో జరుగుతోంది. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సేవలతో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ సేవలు పొందుతున్నారు.

**ఫలిస్తున్న ఎమ్మెల్యే కృషి**

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ రూ.కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రజలకు సత్వర సేవలందించేందుకు నిర్దేశించిన ప్రాధాన్యతా భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) చొరవ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని మునుపెన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి దర్శనమిస్తుంది. మండల వ్యాప్తంగా ప్రజలకు పలు రకాల సేవలందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. గత టీడీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోని పలు రహదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం కలిగింది. స్థానిక సమస్యల పరిష్కారం, అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేందుకు ఎమ్మెల్యే చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ప్రజల మన్ననలందుకుంటున్నారు.

**రూ.కోట్లతో అభివృద్ధి పనులు**

- నియోజకవర్గ పరిధిలో 21 సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు రూ.9.8 కోట్ల మేర నిధులు మంజూరు చేశారు.
- రైతులకు మెరుగైన సేవలందించాలన్న ఆలోచనతో మండల వ్యాప్తంగా 21 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి రూ.4.8 కోట్లు కేటాయించారు.
- గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించాలన్న సంకల్పంతో 7 చోట్ల రూ.కోటీ 35 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు.
- మండల వాసులకు తాగునీటి సమస్య తలెత్తకుండా రూ.19.3 కోట్లమేర జల్ జీవన్ మిషన్ పథకంలో నిధులు వెచ్చించి ఇంటింటికీ కొళాయి పనులు చేపడుతున్నారు.
- అనకాపల్లి-పరవాడ మార్గం నుంచి మూలపేట మీదుగా మునగపాక వరకు రూ.3 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించారు.
- మునగపాకలో రూ.48 లక్షల వ్యయంతో బైపాస్ రోడ్డును పునరుద్ధరించారు.
- మరో రూ.3 కోట్ల వ్యయంతో తిమ్మరాజుపేట నుంచి కుమారపురం వరకు, కొండకర్ల నుంచి కశింకోట మండలం నరసింగబిల్లి వరకు నూతన రహదారులను నిర్మించారు.

### వైఎస్సార్‌సీపీ వచ్చాకే అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తోంది. ప్రజలకు సేవలందించేందుకు వీలుగా పలు ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయి. గతంలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పరిష్కారమవుతున్నాయి. సంక్షేమంతోపాటే అభివృద్ధి కూడా జరుగుతోంది. సీఎం జగన్‌పై గ్రామీణ ప్రజల నమ్మకం మరింతగా పెరిగింది.

– మద్దాల ధనలక్ష్మి, సర్పంచ్, టి.సిరసపల్లి

### ఆదర్శ నియోజకవర్గంగా..



మునగపాక మండలంలోని సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రజలకు సకాలంలో సేవలందించేందుకు అవసరమయ్యే భవనాలను నిర్మిస్తున్నాం. అలాగే సంక్షేమ పథకాల మంజూరులో రాజకీయాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి కార్యాచరణ చేపట్టాం. – యు.వి.రమణమూర్తిరాజు, ఎమ్మెల్యే, యలమంచిలి

### భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలి



శ్రీమద్భగవద్గీతపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

**మునగపాక:** మండలంలోని తోటాడలో నిర్వహించిన ఉచిత భగవద్గీత శిక్షణకు విశేష స్పందన వచ్చింది. ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ సుషుమ్న తెలిపారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలన్నారు. భగవద్గీత సారాంశం తెలుసుకోవడంతో ద్వారా జీవితంలో చాలా సమస్యలు, క్లిష్టపరిస్థితుల్ని ఎదుర్కొనే మానసిక స్థైర్యం అలవడుతుందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### రైతు సంఘ అధ్యక్షుడిగా జగ్గప్పారావు

**మునగపాక:** స్థానిక పసల మారమ్మ రైతు సంఘ అధ్యక్షుడిగా కాండ్రేగుల జగ్గప్పారావు ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలో కార్యదర్శిగా వేగి వెంకట అప్పారావు, కోశాధికారిగా గుమ్మాల అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా కొయిలాడ మహేష్, గణేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు జగ్గప్పారావు మాట్లాడుతూ రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# జైజై గణేశా.. బైబై గణేశా



కోలాటం ఆడుతున్న మహిళలు



మునగపాకలో వినాయకుడిని దర్శించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్



వెంకటాపురంలో అన్న సమారాధన ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ఆలీ

**యలమంచిలి:** యలమంచిలి పట్టణం ఎన్టీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని అనుపు మహోత్సవాన్ని ఆదివారం రాత్రి అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వినాయకుని మందిరం వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేపట్టి, సాయంత్రం వినాయకుడిని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విగ్రహానికి పూజలు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందించారు. బాణా సంచా వెలుగులు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ఊరేగింపుగా వెళ్లి, ఘనంగా నిమజ్జనం చేశారు.

**అన్న సమారాధన**

**రాంబిల్లి:** దిమిలిలో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కోట వారి వీధిలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ అన్న సమారాధన చేశారు. తొలుత వినాయకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. దిమిలి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**మునగపాక:** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధనలు జరిగాయి. భక్తులు భారీగా అన్న సమారాధనలకు తరలివచ్చారు.

- వెంకటాపురంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ ప్రారంభించారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వీఆర్వోల సంఘ రాష్ట్ర నాయకులు బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
- మునగపాకలో మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని, కొత్తమహాలక్ష్మి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆదివారం దర్శించుకుని, పూజలు నిర్వహించారు.

# ‘పప్పు’ వచ్చాక టీడీపీలో మరింత అవినీతి

- ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి వచ్చి డొల్ల కంపెనీల సృష్టి నేర్చుకున్న పప్పు
- పప్పు స్కాంల నుంచి చంద్రబాబు బయటకు రాలేరు
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

**అచ్యుతాపురం(అనకాపల్లి) :** ఇంటర్నేషనల్ స్కూల్లో చదివిన ‘పప్పు’ వచ్చిన తర్వాతే టీడీపీలో అవినీతి పెరిగిందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు చంద్రబాబు కుమారుడు లోకేష్‌ను ఉద్దేశించి అన్నారు. హరిపాలెం గ్రామంలో ఆదివారం రూ.4.42 కోట్లతో చేపట్టిన బల్క్ మిల్క్‌సెంటర్, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీతోపాటు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ డొల్ల కంపెనీలు సృష్టించి, డబ్బు ఎలా తినేయాలో నేర్చుకుని వచ్చిన లోకేష్ వల్లే చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడంటూ ఆయన ఆరోపించారు. స్కిల్ స్కాంలో సీఎంగా 13 సంతకాలు చేసిన చంద్రబాబు రూ.371 కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణాలపై కూడా విచారణ ప్రారంభమైతే చంద్రబాబు ఇక బయటకు రావడం కష్టమేనని జోస్యం చెప్పారు. తప్పు ఎవరు చేసినా జైలుకెళ్లడం ఖాయమని స్కిల్‌స్కాం ద్వారా తేలిందన్నారు. తమ ప్రభుత్వం అను నిత్యం ప్రజల సంక్షేమం కోసమే పాటుపడుతుందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేనిఫెస్టోను అమలు చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేశారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం 2014లో పెట్టిన మేనిఫెస్టోను అమలు చేయలేక వెబ్‌సైట్ నుంచి తొలగించిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా 80 శాతం మందికి ఇప్పటికే పైప్‌లైన్ ద్వారా మంచినీటిని అందించామన్నారు. సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మీకు న్యాయం జరిగితే ఓటు వేయండంటూ చెప్పే దమ్మున్న సీఎం జగన్‌కు వేరెవరూ సాటిరారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, హరిపాలెం సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీ సూర్యకాంతం, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, ఎంపీపీ కోన సంధ్యలచ్చంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పెన్మంరాజు వాసు, రావి శోభన్‌బాబు, ఎంపీటీసీ జ్యోతిర్మయి ప్రసాద్, మునగపాక ఎంపీటీసీ బి.గణేష్, వడిసెల శ్రీనివాసరావు, కూండ్రపు వెంకునాయుడు, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి వేడుకలకు కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల నాగేశ్వరరావు

**అనకాపల్లిటౌన్:** స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయంలో రానున్న శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణలో నూతన పాలకవర్గ తొలి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి వేడుకల్లో సర్వకామదాంబ అమ్మవారు తొమ్మిది రోజులు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. సామూహిక కుంకుమార్చనలు, లలితా పారాయణం, దీపారాధన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నవరాత్రి వేడుకల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.ఆదినారాయణ, ఆలయ ధర్మకర్తలు కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల రాము, సింగంపల్లి రాజేశ్వరి, కమిటీ సభ్యులు కొణతాల అప్పాజీ, మెలిపాక దుర్గ, పేరూరి నారాయణరావు పాల్గొన్నారు.

### ఎస్‌ఐ పాపినాయుడికి సత్కారం



పాపినాయుడిని సత్కరిస్తున్న ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి సంఘ సభ్యులు

**యలమంచిలి:** విధి నిర్వాహణలో బాధ్యతగా పని చేసిన ప్రతి అధికారికి గుర్తింపు ఉంటుందని యలమంచిలి ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి సంఘం సభ్యులు కృపావరం అన్నారు. యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె.పాపినాయుడు గతంలో ఏజెన్సీలో నిర్వహించిన విధులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా గ్యాలంట్రీ మెడల్ అందుకున్న విషయం తెలిసిందే. దీన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని కాకివాని వీధిలో ఉన్న చర్చిలో సంఘ సభ్యులు శాలువా వేసి, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. ఆయన సేవలు మరింతగా ప్రజలకు అందాలని అభిలషించారు. కార్యక్రమంలో కార్యదర్శి చిన్నికుమార్, కోశాధికారి మురళిరాజు, కస్టోడియన్ మోసెస్, హైరాం, బాబూరావు, ప్రకాష్‌రావు, కరుణవేణి, శశికళ, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి ‘జగనన్న సురక్ష’



సర్వేలో పాల్గొన్న రమాకుమారి, కొండలరావు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆరోగ్య సర్వేలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

**యలమంచిలి:** మారుమూల పల్లెల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి తెలిపారు. మున్సిపాలిటీలోని 11, 12 వార్డుల్లో వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యాధికారులు, సిబ్బంది చేపడుతున్న ఇంటింటి సర్వేను కమిషనర్ కె.కొండలరావుతో కలిసి ఆమె ఆదివారం పరిశీలించారు. కుటుంబంలోని సభ్యులకు ఏయే అనారోగ్య సమస్యలున్నాయి. వారికి ఏ మందులు ఇవ్వాలి, ఎలాంటి వైద్య సేవలు అందించాలనే వివరాలను సేకరించి, వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న ప్రక్రియను దగ్గరుండి మరీ పర్యవేక్షించారు. చికిత్స అవసరమైన వారికి టోకెన్లు జారీ చేస్తున్నట్టు వైద్య సిబ్బంది ఆమెకు తెలిపారు. సర్వే పక్కాగా చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నిల్వనీటితో ఉన్న తొట్టిలను ఉంచరాదని, అలాంటి వాటి వల్లే దోమల వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా చాలా అనారోగ్యాలను దూరం చేసుకోవచ్చన్నారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడి చెంతకు ఆరోగ్య సేవలు విస్తరించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, నయం కాని రోగాలకు పెద్దాస్పత్రుల ద్వారా చికిత్స అందిస్తామన్నారు. ప్రజలందరూ తమ ఆరోగ్య సమస్యలను వైద్య సిబ్బందికి వివరించి, ఆరోగ్య యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది దీన్ని బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ యాత్రను జయప్రదం చేయండి



ఉక్కు పరిరక్షణ యాత్రలో పాల్గొన్న సీపీఎం నేతలు, విద్యార్థులు

**అనకాపల్లి రూరల్:** విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 6 వరకూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ బైక్ యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రుత్తల శంకరరావు కోరారు. ఆదివారం పట్టణంలోని రింగు రోడ్డు నుంచి నెహ్రూ చౌక్ కూడలి వరకు సీపీఎం నేతలు ర్యాలీ చేపట్టారు. సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ యాత్రకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించారు. దారి పొడవునా కరపత్రాలను పంచిపెడుతూ, సేవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ అంటూ నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని శంకరరావు తెలిపారు. 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సీపీఎం పార్టీ సీనియర్లు ఎం.బాలకృష్ణ, బొప్పే ఉమామహేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంఎస్ రమణ, జి.తరుణ్ పాల్గొన్నారు.

### ఐద్వా ఢిల్లీ సభను జయప్రదం చేయండి



ఐద్వా బహిరంగ సభ జయప్రదం చేయాలంటూ ప్రచారం చేస్తున్న వరలక్ష్మి

**కశింకోట:** అక్టోబర్ 5న ఢిల్లీలో మహిళా సమస్యలపై ఐద్వా ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి కోరారు. మండలంలోని నరసింగబిల్లిలో ఆదివారం సభకు సంబంధించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై హింస, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశ వ్యాప్తంగా మహిళా పోరు యాత్రలు జరుపుతూ, ఢిల్లీలో ఐద్వా కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మహిళా ప్రతినిధులు వి.శ్యామల, కె.భవాని, వి.రామలక్ష్మి, కె.మణి, టి.దేవి, కె.కుమారి, డి.షర్మిల తదితరులు పాల్గొన్నారు.